



పీయూ పరిపాలన భవనం

పరేషాన్‌లో పత్తి రైతులు

- వర్షాలతో నల్ల బారుతున్న తెల్ల బంగారం
- వేధిస్తున్న కూలీల కొరత
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 2,11,449 ఎకరాలలో సాగు
- ఏర్పాటు చేయని కొనుగోలు కేంద్రాలు
- ఇళ్లలోనే మగ్గుతున్న పత్తి
- పెట్టుబడి కూడా ఎల్లదంటున్న రైతులు



పంట పొలంలోనే నల్లబారిన పత్తి



తడిసి నల్లబారిన పత్తి

అచ్చంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది 2,11,449 ఎకరాలలో పత్తి సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 24,512 ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గింది. పత్తి పంట చేతి కందే సమయంలో ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో పత్తి రైతులు పరేషాన్‌లో ఉన్నారు. కూలీల కొరత తీవ్రంగా ఉండటంతో పత్తి చేనుపైనే నల్లబారుతోంది. కొంతమంది రైతులు పత్తి తీసినా జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం తీవ్ర ఇబ్బంది కలిగిస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం మద్ధతు ధర క్వింటాలుకు రూ.7,500 నిర్ణయించగా ప్రైవేట్ వ్యాపారులు మాత్రం రూ.5,500 మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు ఇలాగే కొనసాగుతే పెట్టుబడి కూడా రాదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాలో సీసీఐ కొనుగోలు పత్తిని కొనుగోలు చేస్తే మద్ధతు ధర లభిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పత్తి నల్లబారుతోంది



పత్తి తీద్దామంటే రోజు వర్షం కురుస్తోంది. తెరిపి ఇచ్చినప్పుడు పత్తి తీసుకుంటున్నాం, కానీ తీసిన పత్తి నల్లగా అవుతోంది. దీంతో ఎవరు కొనేందుకు వస్తలేరు. వచ్చినా తక్కువ ధరకు అడుగుతున్నారు. సర్కారోళ్లు సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేస్తే మద్ధుతు ధర లభిస్తుంది.

- చంద్రయ్య, రైతు ఉప్పునుంతల

కొత్త వీసీ.. పాత సమస్యలు

- తరగతి గదులు, హాస్టళ్లకు భవనాల కొరత
- రెగ్యులర్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది లేక ఇబ్బందులు
- రాష్ట్ర బడ్జెట్‌లో పీయూకి తక్కువ కేటాయింపులు
- కొత్త కోర్సులు అవసరం..
- పీజీ సెంటర్లలో హాస్టళ్లు నిరుపయోగం
- మొదలు కాని లా, ఇంజనీరింగ్ కాలేజీలు



పీయూ గ్రంథాలయం

మహబూబ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌ను అయిదు నెలల తర్వాత నియమించింది. సోమవారం వీసీగా బాధ్యతలు తీసుకోనున్న జీఎస్ శ్రీనివాస్‌కు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. 2008లో యూనివర్సిటీ ప్రారంభం కాగా.. అప్పటి నుంచి వెనుకబడి జిల్లాలో యూనివర్సిటీ పెట్టినప్పటికీ.. ఇప్పటికీ పూర్తిస్థాయి వసతుల కల్పన జరగలేదు. ప్రతీ ఏటా బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు చేస్తుండటం, నిర్వహణ, వేతనాలకే బడ్జెట్ లేకపోవడంతో చివరకు ఎగ్జామినేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి ఫీజుల డబ్బులు తీసుకుని చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం యూనివర్సిటీలను పెద్దగా పట్టించుకోకపోవడంతో పదేళ్ల వెనుకబాటులోకి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పుడు రెగ్యులర్ వీసీ నియామకం అవుతున్నప్పటికీ.. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే


మిగతా 7వ పేజీలో...

బాధ్యతలు చేపట్టిన వీసీ



పీయూ నూతన వీసీ ప్రొఫెసర్ జీఎస్ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇన్‌చార్జి వీసీ మహ్మద్ నదీమ్

పాలమూరు యూనివర్సిటీ, (ఆంధ్రజ్యోతి): పీయూ ఇన్‌చార్జి వీసీ మహ్మద్ నదీమ్ నుంచి శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పీయూ నూతన వీసీగా ప్రొఫెసర్ జీఎస్ శ్రీనివాస్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. మే 21న రెగ్యులర్ వైస్ చాన్సలర్‌గా పనిచేసిన లక్ష్మీకాంత్ రాథోడ్ పదవీ పూర్తి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారి హోదాలో ఇన్‌చార్జి వీసీగా అహ్మద్ నదీమ్‌ను నియమించారు. పీయూ ఐదో రెగ్యులర్ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ జీఎస్ శ్రీనివాస్ పదవీ బాధ్యతలను తీసుకున్నారు. జీఎస్ శ్రీనివాస్‌కు అహ్మద్ నదీమ్ శుభాకాంక్షలు తెలిపారు.



ట్యాంకులో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

పునరావాసం సమస్యలతో సావాసం

- గుడారాల్లో నివసిస్తున్న నిర్వాసితులు
- శిథిలావస్థలో వాటర్ ట్యాంకు
- చదువుకు దూరమైన విద్యార్థులు

6

చెక్కుచెదరని వైభవం



కొల్లాపూర్‌లో 1871లో నిర్మించిన చంద్రమహల్ కోట

- సంస్థానాధీశుల కాలంలో నిర్మించిన భవనాలు
- కొల్లాపూర్‌లో చెక్కుచెదరని నిర్మాణం 'చంద్రమహల్'
- గద్వాల పట్టణంలో ఆకట్టుకుంటున్న కృష్ణారెడ్డి బంగ్లా

వివరాలు 7వ పేజీలో...

విచ్చలవిడిగా పేకాట

- చేతులు మారుతున్న లక్షల రూపాయలు
- చిన్నాభిన్నం అవుతున్న కుటుంబాలు
- ఈ ఏడాది 22 కేసులు, 168 మంది అరెస్టు



రంగాపూర్ శివారులో పట్టుబడిన పేకాట రాయుళ్ల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు (ఫైల్)

వనపర్తి క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈజీగా మనీ సంపాదించాలన్న ఆలోచనతో పలువురు పేకాటకు అలవాటు పడి ఆర్థికంగా కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. మొదట సరదాగా కోసం ప్రారంభించి క్రమంగా బానిసలై పోతున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పేకాట స్థావరాలు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసినా.. ఈ వ్యసనాన్ని వదులుకోవడం లేదు. ఈ నెల 7వ తేదీన రంగాపూర్ శివారులోని ఓ గోదాంలో పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6,35,600 నగదు, నాలుగు కార్లు, మూడు బైక్‌లు, 15 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

జిల్లాకు చెందిన వారితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కొంతమంది ఒక గ్రూప్‌గా ఏర్పడి జిల్లాలోని రహస్య ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారు. పెబ్బేరు మండల పరిసరాల ప్రాంతాలతో పాటు శ్రీరంగాపూర్, ఖిల్లాఘణపూర్, ఆత్మకూరు, అమరచింత, వనపర్తి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కొనసాగుతుంది. కొన్ని చోట్ల రహస్య ప్రదేశాల్లో.. మరి కొన్నిచోట్ల కొందరు రాజకీయ నాయకుల ఇళ్లల్లో కూడా పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోజుకు రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు డిపాజిట్ చేస్తేనే అవకాశం ఇసున్నారని, వారికి అవసరమైన మందు, విందు లాంటి సకల సౌకర్యాలు కల్పిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నా యి. పేకాడే క్రమంలో వారికి ఇబ్బందులు తలెత్తకుండా పలు చోట్ల నిర్వాహకులు ముందస్తుగానే పోలీసులను మేనేజ్ చేస్తున్నట్లు సమాచారం. దీంతో వారి దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో సైతం ఈ ఆట కొనసాగుతోంది. కొందరికి ఈ గేమ్‌లపై అవగాహన లేకున్నా యూట్యూబ్‌లలో ఉండే వీడియోలు చూసి నేర్చుకొని ఆడుతున్నట్లు సమాచారం.

పోలీస్ స్టేషన్‌లలో సెటిల్‌మెంట్‌లు!

ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 22 పేకాట కేసులు నమోదు చేశారు. 168 మందిని అరెస్టు చేసి రూ.8,40,000 నగదు సీజ్ చేశారు. అదేవిధంగా వారి నుంచి 60 సెల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇవే కాకుండా కొన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో సెటిల్‌మెంట్ చేసుకుని వదిలేస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ఈ ఆట ఆడేవారిలో ప్రభుత్వ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నట్లు సమాచారం. జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి పేకాటరాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన బ్యాం కర్లతో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల నమోదు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బ్యాంకు ఖాతాలు ఉన్న వారంతా ఈ బీమా పథకాలకు అర్హులేనని, వారందరికీ ఈ బీమా పథ కాలు అమలయ్యేలా బ్యాంకర్లు సీరియస్‌గా దృష్టి సారిం చాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీ రుణాలు వేగంగా గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజనుల ఆర్థికాభ్యున్నతికి 80 శాతం రాయితీపై ప్రభుత్వం ఏటా ట్రైకార్ ట్రైబల్ కార్పొరేషన్ రుణాలు కేటాయిస్తుందన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఇంకా పెండింగ్‌లో ఉన్న రుణాలను గ్రౌండింగ్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనశాఖ అధికారిని ఆదేశించారు. అదే విధంగా ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి, గిరిజన శాఖ అధికారి నుశిత ఉన్నారు.

దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను తక్షణమే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం ఆయన చాంబర్‌లో తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి, ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, మాడ్యూల్ 33, ప్రొహిబిటెడ్ ల్యాండ్, మ్యుటేషన్, సక్సెషన్ దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎం గ్రీవెన్స్ ఫిర్యాదులను, ఎక్స్ సర్వీస్ మాన్, ఫ్రీడం ఫైటర్‌కు సంబంధించి నోఅబ్జక్షన్ సర్టిఫికెట్స్ త్వరగా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రామ్‌చందర్, తహసీల్దార్లు ఉన్నారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులతో ఉద్యోగావకాశాలు
» రాష్ట్ర ఐటీఐ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు

7

తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా విశ్రాంతం ప్రొఫెసర్ వెల్దండ నిత్యానంద రావు
- పాలెం ప్రాచ్య కళాశాల పూర్వ విద్యార్థి

సొంత వాహనంలా చూసుకోవాలి



పోలీస్ వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ

వనపర్తి క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో ఉండే ప్రతీ వాహనాన్ని సిబ్బంది తన సొంత వాహనంలా చూసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఎస్పీ కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన వాహన డ్రైవర్ల శిక్షణ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీస్ శాఖ గౌరవం మీ చేతుల్లో ఉందనే విషయాన్ని గుర్తించుకొని క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతీ వాహనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి కండిషన్లో ఉంచుకోవాలని తెలిపారు. ఎస్కార్ట్ వెళ్లే వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పోలీసు వాహనాలను పరిశీలించారు. పలువురి డ్రైవర్లకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజావత్ సిబ్బంది ఉన్నారు.

క్రీడలకు పెద్దపీట

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాలలో సీఎం కప్ టార్చ్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

గద్వాల అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన సీఎంకప్ పోటీలకు సంబంధించి టార్చ్ ర్యాలీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వనపర్తి జిల్లా నుంచి వచ్చిన టార్చ్ ర్యాలీని శనివారం పట్టణ శివారులో సంగాల పార్కు వద్ద కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావులతో కలిసి ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం టార్చ్ ర్యాలీని పుర వీధుల మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, డీవైఎస్‌ఓ డాక్టర్ బీఎస్ ఆనంద్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, కౌన్సిలర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.



పిల్లర్లకు ప్లాస్టిక్ కవర్లు కట్టుకుని జీవనం సాగిస్తున్న నిర్వాసితుడి కుటుంబం

బస్ షెల్టర్‌లోనే ప్లాస్టిక్ కవర్లు అడ్డంగా కట్టుకొని జీవనం సాగిస్తున్న పాండు రంగడు కుటుంబం

పునరావాసం

● సమస్యలతో సావాసం

- గుడారాలు వేసుకొని నివసిస్తున్న నిర్వాసితులు
- అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ నీటి సరఫరా
- శిథిలావస్థలో వాటర్ ట్యాంకు
- 15 ఏళ్లుగా పిల్లర్లకే పరిమితమైన పాఠశాల భవనం
- చదువుకు దూరమైన విద్యార్థులు



గట్టు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించక పోవడంతో ప్రజలు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. రిజర్వాయర్‌లోకి నీరు చేరడంతో ముంపు గ్రామం (పాత గ్రామం)నుంచి ఎర్రగట్టు దగ్గర గల పునరావాస కేంద్రానికి చేరుకున్న ముంపు ప్రజలకు పుట్టెడు కష్టాలు ఎదురౌతున్నాయి. నివాసాలు కట్టుకోవడానికి ఆర్థిక స్థోమత లేక పోవడంతో పునరావాస కేంద్రంలో నిర్మించిన బస్ షెల్టర్‌తో పాటు ప్రభుత్వ భవనాల కోసం నిర్మించిన సిమెంటు పిల్లర్లను ఆసరాగా చేసుకుని ప్లాస్టిక్ కవర్లను అడ్డంగా కట్టుకుని పిల్లా పాపలతో జీవనం సాగిస్తున్న దయనీయ దృశ్యాలు ప్రస్తుతం చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో కనిపిస్తున్నాయి.

పునరావాస కేంద్రాన్ని 'ఆంధ్రజ్యోతి' సందర్శించి అక్కడ ప్రజల జీవన స్థితిని పరిశీలించింది. నీటి ముంపుతో ఆందోళన చెంది అష్ట కష్టాలు పడుతూ ముంపు గ్రామాన్ని ఖాళీ చేసి పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. తీరా ఇక్కడ చూస్తే మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారు. తాగునీరు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్య, అంతర్గత రోడ్లు వంటివి అస్తవ్యస్తంగా ఉన్నాయి. అన్ని సౌకర్యాలు కల్పించి ఆదుకుంటామని చెప్పిన అధికారులు నేటి వరకు ఆ దిశగా పనులు చేపడుతున్న దాఖలాలు లేవని ముంపు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల క్రితం చేపట్టిన పనులన్నీ పాడై పోయాయని, తామంతా సమస్యలతో సహజీవనం చేయక తప్పడం లేదంటున్నారు.

● నిలిచిన అంగన్‌వాడీ సేవలు

పునరావాస కేంద్రంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. రెండు నెలలుగా చిన్నోనిపల్లిలో అంగన్‌వాడీ చదువులు నిలిచిపోయాయి. గ్రామం ఖాళీ చేసి రెండు నెలలు కావస్తున్నా ప్రత్యామ్నాయం చూపక పోవడంతో అంగన్‌వాడీ చదువులు అటకెక్కాయి.

● ఇళ్లు నిర్మించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక పోవడంతో కొందరు నిర్వాసితులు బస్‌షెల్టర్‌తో పాటు అసంపూర్తిగా నిర్మించి వదలి వేసిన ప్రభుత్వ భవనాలలో గుడారాలు వేసుకుని ఉంటున్నారు. పాండురంగడు, పులికల్ నర్సింహులు, గచ్చింటి నర్సింహులు కుటుంబాలు గుడారాలలో జీవనం సాగిస్తున్న దృశ్యాలు పునరావాస కేంద్రంలో కనిపిస్తున్నాయి.

పునరావాస కేంద్రంలోని ప్రజల కోసం మిషన్ భగీరథ ట్యాంకును నిర్మించారు. ఈ ట్యాంకు నిర్మాణం చేపట్టి వదలి వేయడంతో అట్టి ట్యాంకు వినియోగంలోకి రాక ముందే శిథిలావస్థకు చేరింది. పైపు లైన్లు అదృశ్యం కాగా నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. నీటి కోసం నల్లాలు అమర్చినా అవి అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. ఇంకా నిర్మాణంలో ఉన్న నివాసాలకు ట్యాప్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉన్నది.

● పునరావాస కేంద్రంలో గత 15 సంవత్సరాల క్రితం డ్రైనేజీలు, అంతర్గత రహదారులు నిర్మించారు. వాటిలో కంప చెట్లు, పిచ్చి మొక్కలతో పాటు మట్టి పేరుకపోవడంతో డ్రైనేజీలు శిథిలావస్థకు చేరి నీరు వెళ్లడానికి అవకాశం లేకుండా అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

● పది సంవత్సరాల క్రితం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. తీగలు అస్తవ్యస్తంగా ఉండటంతో విద్యుత్ సరఫరా కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. పునరావాస కేంద్రంలో గ్రామానికి సరిపడా కెపాసిటి గల ట్రాన్స్‌ఫార్మర్స్ లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు.

● పునరావాస కేంద్రంలో అంతర్గత రోడ్ల దుస్థితి అధ్వానంగా మారింది. గత పదిహేను సంవత్సరాల క్రితం నిర్మించిన రోడ్లు కావడంతో రోడ్లన్నీ పనికి రాకుండా శిథిలమయ్యాయి.

● సమస్యలు ఇవీ..

● ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి రూ.47.70 లక్షలు మంజూరీ కాగా ఇప్పటివరకు నిర్మాణం మధ్యలోనే నిలిపి వేసి 17 ఏళ్లుగా పిల్లర్లకే పరిమితం చేశారు. అంగన్‌వాడి భవనానికి రూ. 10.20 లక్షలు మంజూరు కాగా కేవలం పిల్లర్లకే పరిమితం చేసి కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలుపుదల చేసి వెళ్లాడు. గ్రామ పంచాయతీ భవనం కోసం రూ 22.50 లక్షలు మంజూరు కాగా ఇంత వరకు నిర్మాణం జరగలేదు.

● పునరావాస కేంద్రంలో పాఠశాల భవనం లేక పోవడంతో పునరావాస కేంద్రంలోని విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయి. మొత్తం ఐదు తరగతులకు కలిపి 42మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. గ్రామం ఖాళీ చేయడంతో ప్రస్తుతం పక్కనే ఉన్న అంతంపల్లి గ్రామంలోకి పాఠశాలను షిఫ్ట్ చేశారు. దీంతో సగం మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారు. పాత గ్రామంలో కొందరు ఉండి పోగా, పునరావాసంలో మరికొంత మంది విద్యార్థులు ఉండిపోయారు. నడుచుకుంటూ పక్క గ్రామానికి పోలేక ఇళ్లదగ్గరే ఉండి పోతున్నారు. చదువులు అస్తవ్యస్తంగా మారాయి.

మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నాం



పునరావాస కేంద్రంలో సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతులు లేవు, ప్రధానంగా తాగునీటికి ఇబ్బందులు, అంతర్గత రోడ్లు, విద్యుత్ సమస్య డ్రైనేజీలు శిథిలమై పోయాయి. కొత్త ఇళ్ల నిర్మాణానికి అవస్థలు పడుతున్నాం. కొందరు గుడారాల్లోనూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పునరావాస కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలను ఆదుకోవాలి.

– వీరేష్, నిర్వాసితుడు, చిన్నోనిపల్లి



15 ఏళ్లుగా పిల్లర్లకే పరిమితమైన పాఠశాల భవనం

పునరావాస కేంద్రాన్ని సందర్శిస్తాం..



పునరావాస కేంద్రలోని ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా తొందరలోనే చిన్నోనిపల్లి పునరావాస కేంద్రాన్ని సందర్శించి అక్కడ సమస్యలు తెలుసుకుంటానన్నారు. క్షేత్రస్థాయిలో వెళ్లి వారు ఎలాంటి సమస్యలు ఎదుర్కుంటున్నారో స్వయంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తిసుకుంటానన్నారు.

– అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.లక్ష్మీనారాయణ

ఆధ్యాత్మికం

ఘనంగా వట్టెం వెంకన్న పవిత్రోత్సవాలు



వట్టెం వెంకన్న స్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

బిజినేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వట్టెం వెంకన్న స్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం రెండవ రోజు ఉత్సవ మూర్తులకు ద్వార తోరణం, ధ్వజకుంభ ఆరాధన, చతుస్థానార్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకులు శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకం, సహస్రనామాల పఠనం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. భక్తులకు అన్నదాన వితరణ చేపట్టారు.

కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సందడి ప్రతాప్‌రెడ్డి, సందడి నరేందర్‌రెడ్డి, కొర్ర చంద్రారెడ్డి, కూచకుళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బండారు రాజశేఖర్ ఉన్నారు.

అభయుడి ఆలయంలో భక్తుల సందడి

ఊర్కొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శనివారం తెల్లవారు జామున అర్చకులు స్వామి వారికి అభిషేకంతో పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి తమ మొక్కులు చెల్లించుకొని సామూహిక వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆలయ అధికారులు మారుతిరావు, వరలక్ష్మి, శ్రీశైలం, రవికుమార్ అర్చకులు దత్తాత్రేయశర్మ, మహేష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, శ్రీనివాసశర్మ, భక్తులు ఉన్నారు.

కురుమూర్తి ఆలయ హుండీ లెక్కింపు

చిన్నచింతకుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి ఆలయం ప్రాంగణంలో హుండీని శనివారం లెక్కించారు. లెక్కింపును దేవాదాయ అధికారులు, భక్తుల సమక్షంలో చేపట్టారు. ఇందులో రూ. 3,18,276 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఈవో మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, అధికారులు

కాడాకు రూ.60 కోట్లు మంజూరు

కోస్గి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 60 కోట్లు మంజూరు చేశారు.

ఈ నిధులతో ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయనున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని ఉమ్మడి ఐదు మండలాలు కొడంగల్, దౌల్తాబాద్, మద్దూర్, కోస్గి, బొంరాస్‌పేట్‌కు సంబంధించి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల భవనాల మరమ్మతులు, నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాగా నియోజకవర్గంలోని పాఠశాలల్లో సర్వే చేసి సుమారు రూ.120 కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపగా మొదటి విడతగా రూ. 60 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు పూర్తికాగానే మరో రూ.60 కోట్లు మంజూరు చేస్తుందని కొడంగల్ డెవలప్‌మెంట్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

దీంతో ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించనున్నారు.

స్పోర్ట్ న్యూస్

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కరాటే, ఆర్చరీ ఎంపికలు



ఆర్చరీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు అందజేస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి జిల్లా కరాటే, ఆర్చరీ జట్ల ఎంపికలు శనివారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఎంపికలను ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రట రీ శారదాబాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉమ్మడి జిల్లాకు ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులకు తుది జట్టుకు ఎంపిక చేస్తామని, ఎంపికలు పారదర్శంగా నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో పేట టీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, వ్యాయమ ఉపాధ్యాయులు వేణుగోపాల్, సీనియర్ కరాటే మాస్టర్లు కృష్ణయ్య. జహంగీర్, చెన్నయ్య, రవి, ఆర్చర్ కోచ్ జ్ఞానేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక



లోకేశ్వరి



తరుణ్

గద్వాల అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో, పాలమూరు యూనివర్సిటీలో నెల 18, 19 తేదీల్లో నిర్వహించిన ఆల్ ఇండియా తైక్వాండో యూనివర్సిటీ పోటీల్లో అండర్-46 వెయిట్ కేటగిరిలో జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన లోకేశ్వరి, తరుణ్ ప్రతిభ కనబరిచారు. వీరు ఇరువురు ఆల్ ఇండియా తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాస్టర్ శ్రీహరి శనివారం తెలిపారు. ఆల్ ఇండియా తైక్వాండో యూనివర్సిటీ ఎంపిక పోటీల్లో లోకేశ్వరి గోల్డ్‌మెడల్ సాధించినట్లు తెలిపారు. ఇరువురు క్రీడాకారులు నవంబరు 12న పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో నిర్వహించే ఆల్ ఇండియా యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల ఎంపికలు

మూసాపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని వేముల జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఇందులో ప్రథమ బహుమతి మహబూబ్‌నగర్ జట్టు, ద్వితీయ బహుమతి గద్వాల జట్టు, తృతీయ బహుమతి నారాయణపేట జట్టు, బాలికల్లో ప్రథమ బహుమతి మహబూబ్‌నగర్ జట్టు, రెండో బహుమతి నాగర్‌కర్నూల్ జట్టు, మూడో బహుమతి గద్వాల జట్టు ఎంపికైనట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ చైర్మన్ రవికుమార్, జీహెచ్ఎం రాజేశ్వర్, గణేష్ నాయుడు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, శారదాబాయి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ఎంపిక



పీయూలోని ఇండోర్ స్టేడియంలో పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్ పోటీలలో పాల్గొనేందుకు పీయూలో తైక్వాండో పురుష క్రీడాకారులను శనివారం ఇండోర్ స్టేడియంలో ఎంపికలను నిర్వహించారు. ఎంపికలకు యూనివర్సిటీలోని అనుబంధంగా ఉన్న అన్ని కళాశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి పీయూ పీడీలు, కోచ్‌లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను నలుగురిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పంజాబ్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సటీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 21 తేదీన కబడ్డీ మహిళల, పురుషల ఎంపికలు ఉంటాయని పీయూ పీడీ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య. పీడీ సత్యభాస్కర్‌రెడ్డి, వెంకటేష్‌రావు, బాబులాల్ తదితరలుఛ పాల్గొన్నారు.

ఆరు నెలలుగా విధులకు డుమ్మా

- పట్టించుకోని అధికారులు
- ఓ అవుట్‌సోర్సింగ్ ఫిజియోథెరపీ విభాగం ఉద్యోగి నిర్వాకం



జనరల్ ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ విభాగం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగం రావడమంటేనే గగనం. అలాంటిది అదృష్టం కొద్ది వైద్య ఆరోగ్యశాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం వచ్చింది. అయితే ఒక స్కీం కింద జనరల్ ఆసుపత్రిలోని ఫిజియోథెరపి విభాగంలో విధుల్లో చేరింది. కాని తాను చేరిన నాటి నుంచి ఇప్పటి వరకు విధులకు గైర్హాజరవుతూనే ఉంది. అయినా అధికారులు మాత్రం ఆ ఉద్యోగిని ఏమీ అనడం లేదు. వాస్తవానికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి నెలకు మించి సెలవు ఇవ్వరు. కానీ ఆ ఉద్యోగి ఆరు నెలలుగా ఉద్యోగానికి రాకపోయినా ఏమీ అనకపోవడం గమనార్హం.

- జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఎన్‌హెచ్‌ఎం స్కీం ఫిజియోథెరపిస్టు ఖాళీగా ఉండటంతో అవుట్‌సోర్సింగ్ కింద ఆ ఉద్యోగిని తీసుకున్నారు. ఈమేరకు జనరల్ ఆసుపత్రిలో కొనసాగుతున్న ఫిజియోథెరపి విభాగంలో విధుల్లో పెట్టారు. డ్యూటీ ఇక్కడ చేస్తూ నెల నెలా హాజరు శాతం పంపిస్తే డీఎంహెచ్‌వో కార్యాలయంలో వేతనం చేస్తున్నారు. ఈ మేరకు అక్కడి నుంచి జీతం తీసుకుంటోంది. ఏడాదిన్నర క్రితం నుంచి ఇక్కడే పనిచేస్తోంది. అయితే మొదటి నుంచే నెలలో 10 రోజులు గైర్హాజరవుతూనే ఉంది. ఈ ఏడాది మే నెల నుంచి విధులకు పూర్తిగా హాజరు కావడం లేదు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్ప టి వరకు చూస్తే మే నెలలో 15 రో జులు, జూన్ నెలలో నాలుగు రోజులు, జులై నెలలో పది రోజులు, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబ ర్ నెలల్లో పూర్తిగా రావడం లేదు. మెడికల్ లీవ్ అంటూ నెల నెలా సెలవులను పొడగించుకుంటూ వెళ్త న్నారు. దీంతో ఆ విభాగంలో పనిచేసే ఒక్క ఉ ద్యోగిపై తీవ్ర భారం పడుతోంది. రోగులు ప్రతి రోజు అధిక సంఖ్యలో వస్తున్నప్పటికీ గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. వాస్తవానికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెల రోజులకు మించి సెలవు ఇవ్వరు. అంతకు మించి గైర్హాజరైతే కొత్తవారిని తీసుకునేందుకు అవకాశం ఉంది. కొత్తవారిని తీసుకోవడం లేదు. ఆ ఉద్యోగిని తొలగించడం లేదు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పద్మను వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని, నెలల తరబడి గైర్హాజరు ఉంటే తొలగించి, కొత్త వారిని నియమిస్తామని తెలిపారు.

తెరపైకి నల్లకుంట ఎఫ్‌టీఎల్

- వందలాది టిప్పర్‌లతో ఐదు ఎకరాలలో మట్టిని నింపిన వైనం
- సీనరేజ్ చార్జీలను మైనింగ్ శాఖ విధించేలా చర్యలు తీసుకుంటా - ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల పట్టణంలోని నల్లకుంట ఎఫ్‌టీఎల్‌లో టిప్పర్‌లతో తెచ్చి నింపుతున్న మట్టి (ఫైల్)

జడ్చర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట ఫుల్ లెవల్ ట్యాంక్ (ఎఫ్‌టీఎల్) స్థలంలో టిప్పర్‌లతో అక్రమంగా మట్టిని నింపిన అంశం తాజాగా తెరపైకి వచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల నియోజకవర్గంలోని బాలానగర్ మండలం పెద్దచెరువు కాలువ స్థలంలో మట్టిని పోయడంతో మైనింగ్‌శాఖ అధికారులు రూ.5.12కోట్ల సీనరేజ్ చార్జీలు విధించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ఇదే సందర్భంలో ఎఫ్‌టీఎల్‌లో జరుగుతున్న నిర్మాణాలపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సైతం ఆరా తీశారు.

జడ్చర్ల పట్టణంలో ఉన్న నల్లకుంటను మినీట్యాంక్‌బండ్ తీర్చిదిద్దేందుకు అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అందుకు తగ్గ చర్యలు చేపట్టింది. చెరువులోని సుమారు ఐదు ఎకరాలలో మినీట్యాంక్‌బండ్ నిర్మాణం చేపట్టారు. మిగిలిన భూమి అంతా ఎఫ్‌టీఎల్‌లో ఉండగా తమ పట్టా భూమి అంటూ భూ యజమానులు ప్రహరీని ఏర్పాటు చేసుకున్నారు. సుమారు తొమ్మిది ఫీట్ల మేర ఇతర ప్రాంతాల నుంచి మట్టిని తీసుకువచ్చి నింపేశారు. చట్టవ్యతిరేకంగా నిర్మాణాలు చేపట్టవద్దని, మట్టిని నింపవద్దంటూ ఇరిగేషన్‌శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు జారీ చేసిన నోటీసులకు వ్యతిరేకంగా యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు సైతం కౌంటర్ దాఖలు చేయడం, ఎఫ్‌టీఎల్ స్థలంలో నిర్మాణాలు చేపట్టడం అక్రమమేనని, నిర్మాణాలను వారం రోజుల్లోగా తొలగించి, అందుకు సంబంధించిన ఫొటోలను సమర్పించాలంటూ హైకోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. ఉత్వర్వులు నిజమేనని, వారంలోగా నిర్మాణం చేపట్టిన వారే తొలగించాలని ఉందని మున్సిపల్ కమిషనర్ రాజయ్య తెలిపారు. ఈ అంశంపై ప్రసుతం ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రభుత్వానికి ప్రశ్నిస్తున్నారు. ఎఫ్‌టిఎల్‌లో ప్రహరీ నిర్మాణం చేపట్టిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోరంటూ, సహకరించిన అధికారులపై చర్యలేవని ప్రశ్నిస్తున్నారు.



జడ్చర్ల మునిసిపాలిటీలోని నల్లకుంట ఎఫ్‌టీఎల్‌లో రేకులతో నిర్మించిన ప్రహరీ

అక్రమాలను సహించేదిలేదు : జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే

అవినీతి, అక్రమాలను సహించేదిలేదు. నల్లకుంట ఎఫ్‌టీఎల్ స్థలంలో పూడ్చిన మట్టిని లెక్కించి సీనరేజ్ చార్జీలను మైనింగ్‌శాఖ అధికారులు విధించేలా చర్యలు తీసుకుంటాం. ఎఫ్‌టీఎల్ స్థలంలో మట్టితో నింపిన అంశంలో అప్పటి తహసీల్దార్ తప్పుడుదోవ పట్టించాడు. వరద వచ్చిన సందర్భంలో నల్లకుంట ప్రాంతానికి వెళ్లగా ఎఫ్‌టిఎల్‌లో నిర్మించిన ప్రహరీని చూడడం జరిగింది.

వెంటనే ఇరిగేషన్, మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించాం. ప్రస్తుతం హైకోర్టు ఉత్తర్వుల మేరకు పూడ్చిన మట్టిని తొలగించే పనులు చేపడుతున్నారు.

అయినా సీనరేజ్ చార్జీలు విధించే అంశంలో వెనక్కిపోయేదిలేదు.



జటప్రోల్ గ్రామంలో మదనగోపాలస్వామి ఆలయ గోపురం



కొల్లాపూర్‌లో సురభి రాజుల కోట ముఖద్వారం



1948లో పరిపాలన సాగించిన సురభి సంస్థానాధీశులు సురభి రాజా వెంకట జగన్నాథరావు



సింగోటం గ్రామంలో రత్నగిరి కొండపై పద్మనిలయం పేరుతో నిర్మించిన విడిది బంగ్లా

అలనాటి రాజసం చెక్కుచెదరని వైభవం

» సంస్థానాధీశుల కాలంలో నిర్మించిన భవనాలు » కొల్లాపూర్‌లో చెక్కుచెదరని నిర్మాణం 'చంద్రమహల్'
» సింగోటం రత్నగిరి కొండపై వెలసిన 'పద్మ నిలయం' » గద్వాల పట్టణంలో ఆకట్టుకుంటున్న కృష్ణారెడ్డి బంగ్లా

అలనాడు సంస్థానాధీశుల కాలంలో నిర్మించిన భవనాలు చరిత్రకు సాక్ష్యాలుగా నేటికీ సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. ఆ భవనాలు వారి అభిరుచికి, ఆ నాటి వైభవానికి నిదర్శనాలుగా నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. వారసులు వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

- కొల్లాపూర్/ గద్వాల టౌన్(ఆంధ్రజ్యోతి)

ఈ భవనాలు సంస్థానాల కాలపు వైభవానికి ప్రతీకలు.. నాటి పాలకుల రాజసానికి, ప్రముఖుల అభిరుచికి నిదర్శనాలు.. అవి చెక్కు చెదరకుండా సంస్థానాధీశుల వారసులు సంరక్షించుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని చంద్రమహల్, సింగోటం సమీపంలోని రత్నగిరి కొండపైనున్న పద్మనిలయం నేటికీ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. జటప్రోల్ సంస్థానాధీశులు నిర్మించిన భవనాలు ఇవి. 'సురభి' ఇంటిపేరుగా ఉన్న వీరు మొదట జటప్రోలు నుంచి, ఆ తర్వాత కొల్లాపూర్ కేంద్రంగా పరిపాలన కొనసాగించారు. ప్రస్తుతం 29వ రాజుగా వెంకటకుమార కృష్ణ బాలాదిత్య లక్ష్మారావు కొనసాగుతున్నారు. సురభి సంస్థానాధీశుల్లో 25వ తరం వారైన రాజా లక్ష్మణ రాయ బహదూర్‌కు మగ సంతానం లేకపోవడంతో, రావు వంశానికి చెందిన వెంకటలక్ష్మీ జగన్నాథరావును దత్తత తీసుకున్నారు. 1851 నుంచి 1884 వరకు పరిపాలన సాగించిన ఆయన హయాంలోనే 1871లో కొల్లాపూర్‌లో చంద్ర మహల్ పేరిట కోటను, 1916లో విజయ మహల్ భవనాన్ని నిర్మించారు. ఆ తర్వాత సంస్థానాన్ని పరిపాలించిన వారిలో ఒకరైన వెంకట జగన్నాథరావు మొదట తల్లి రత్నమాంబ సంరక్షణలో పరిపాలన కొనసాగించారు. 1943లో పూర్తిస్థాయి పరిపాలన బాధ్యతలు చేపట్టారు.

ఆయన హయాంలో నాటి సింగపట్నం, నేటి సింగోటం సమీపంలోని రత్నగిరి కొండపై రత్నలక్ష్మి అమ్మవారిని ప్రతిష్ఠించారు. అక్కడే పద్మ నిలయం అనే పేరుతో విడిది కోసం బంగ్లాను నిర్మించారు.

మాట పట్టింపుతో మగసాల దాటి..

గద్వాల పట్టణంలోని అత్యంత పురాతన భవనమైన కృష్ణారెడ్డి బంగ్లా ఇప్పటికీ తన రాజసాన్ని కోల్పోకుండా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 1924 అనంతరం గద్వాల సంస్థాన పాలకుడు సీతారాం భూపాల్ మృతి చెందాడు. అనంతరం ఆయన భార్య మహరాణి ఆదిలక్ష్మీ దేవమ్మ అధికారం చేపట్టారు. సీతారాం భూపాల్‌కు సోదరుడైన వెంకటకృష్ణారెడ్డికి అప్పటి పాలకులతో మాట పట్టింపు వచ్చింది. దీంతో మొగసాల (కోట ఆవరణ) దాటి నిర్మించిన భవనమే నేటికీ చెక్కుచెదర కుండా ఉన్న కృష్ణారెడ్డి బంగ్లా. గద్వాల చివరి సంస్థాన పాలనలో రెవెన్యూ, భూ పరిపాలనా బాధ్యతలు నిర్వహించిన వెంకట కృష్ణారెడ్డి రాజ ప్రసాదాలను తలదన్నే రీతిలో ఈ భవనాన్ని నిర్మించారు. 1972 తర్వాత ఇదే బంగ్లాలోనే జూరాల ప్రాజెక్టు సర్వే కార్యాలయం, అనంతరం ఎస్‌ఈ కార్యాలయం కొనసాగాయి. ఆ తర్వాత కొన్నాళ్లు గద్వాల బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని నిర్వహించారు. 1987లో మండలాల ఏర్పాటు సందర్భంగా, గద్వాల మండలం రెవెన్యూ కార్యాలయాన్ని కూడా ఈ భవనంలోనే కొనసాగించారు. ఇప్పటికీ ఈ భవనం నివాసయోగ్యంగా ఉంది. అందులోని ఒక భాగంలో ప్రైవేటు ఐటీఐ కళాశాల కొనసాగుతోంది. వెనుకనున్న విశాలమైన భవనంలో ఎంబీ హైస్కూల్ నిర్వహిస్తున్నారు. అలాగే భీమ్‌నగర్ పరిసరాల్లో అప్పటి సంస్థాన రాజు సీతారాంభూపాల్‌కు మరో సోదరుడైన భీమ్‌రెడ్డి నిర్మించిన బంగ్లా ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. అందులో ఒక ప్రైవేటు జూనియర్ కళాశాల కొనసాగుతోంది.

అన్ని కాలాలకూ అనుకూలం



మా బాల్యం అంతా కృష్ణారెడ్డి బంగ్లాలోనే సాగింది. శీతాకాలమైనా, వేసవి అయినా ఒకే రకమైన వాతావరణం ఉండటం బంగ్లా ప్రత్యేకత. వంద ఏళ్ల క్రితం కట్టిన ఈ బంగ్లాలోని ప్రధాన నిర్మాణాలు ఇప్పటికీ చెక్కుచెదర లేదు. మేము నివాసముండే గదులను మాత్రం ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చుకున్నాం.

- వి.వెంకట కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి బంగ్లా వారసుడు, గద్వాల



గద్వాల పట్టణంలోని పురాతన కృష్ణారెడ్డి బంగ్లా



సురభి సంస్థానాధీశులు మొట్టమొదటిసారిగా పరిపాలన సాగించిన జటప్రోల్ సంస్థానం కోట

కొత్త వీసీ.. పాత సమస్యలు

(మొదటిపేజీ తరువాయి)

భారీ మొత్తంలో నిధుల అవసరం ఏర్పడనుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం ఉషా పథకం కింద రూ. 100 కోట్లు కేటాయించినప్పటికీ.. అవి కొత్త భవనాల నిర్మాణ అవసరాలకే వినియోగించనున్నారు. కానీ నిర్వహణ విషయంలో ఎవరికీ పట్టింపు లేదనే వాదనలు ఉన్నాయి. మరి కొత్త వీసీ ఈ సమస్యలను గుర్తించి.. సవాళ్లను అధిగమిస్తారా? ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి ఏ విధంగా యూనివర్సిటీని ప్రగతి పథంలోకి తీసుకెళ్తారో వేచిచూడాలి.

భవనాలు లేవు.. తరగతులకు ఇబ్బందులు..

యూనివర్సిటీలో మొత్తం 20 విభాగాలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా తెలుగు, ఎంబీఏ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్ విభాగాలకు తరగతి గదుల కొరత ఉంది. ఈ విభాగాలకు ల్యాబ్‌లు లేవు. వీటికి తరగతి గదులు లేకపోవడంతో వేరే విభాగాల ల్యాబ్‌లలో.. స్పోర్ట్స్ విభాగం గదుల్లో, స్టోరేజీ రూముల్లో తరగతులను నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. ఎన్విరాన్‌మెంట్ సైన్స్, ఎంసీఏ కోర్సుల్లో కొన్ని తరగతులను షిఫ్టుల ప్రకారం నిర్వహించాల్సి వస్తోంది. వర్సిటీలో దాదాపు 2వేల మంది విద్యార్థులు అభ్యాసం చేస్తున్నారు. ఇందులో కేవలం 600 మంది విద్యార్థినులకు, 500 మంది విద్యార్థులకు మాత్రమే హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. డిస్టెన్స్‌ను బట్టి హాస్టల్ సీట్ ఇస్తున్నారు. మిగతావారిని డే స్కాలర్ కింద పరిగణిస్తున్నారు. యూనివర్సిటీలో సీటు వచ్చినా.. ప్రైవేటులో చదువుకున్నట్లే ఉంది. హాస్టల్‌లో చదివే పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా రావడం లేదు. అప్పులు తెచ్చి మెస్‌లను రన్ చేయాల్సి వస్తోంది. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది లేక కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం యూనివర్సిటీలో 150 మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండాలి.. కానీ ప్రస్తుతం 18 మంది మాత్రమే రెగ్యులర్ ఉన్నారు. మిగతావారిని కాంట్రాక్టు పద్ధతిన పనిచేయిస్తున్నారు. కానీ 2016లో 63 రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులు మంజూరు కాగా.. ఏళ్లుగా భర్తీ కావడం లేదు. నాన్‌టీచింగ్‌కు సంబంధించి 300 మందికిపైగా ఉండాలి. కానీ సగం మంది కూడా లేరు. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో తాత్కాలికంగా కొందరు, అడ్‌హక్ కింద కొందరు, జీతాలు కూడా అరొకరగా ఉండటం, వారు ధర్నా చేయాలని యోచిస్తుండటంతో వీసీకి మొదటి సవాల్ ఇదే ఎదురు కానుంది. అలాగే పాలమూరు యూనివర్సిటీ కింద మూడు పీజీ సెంటర్లు ఉన్నాయి. వనపర్తి, గద్వాల, కొల్లాపూర్‌లో కొన్ని కోర్సులే నడుస్తున్నాయి. నడిచిన వాటికి హాస్టల్ భవనాలు ఉన్నా.. నిరుపయోగంగా ఉంచడంతో విద్యార్థులు సరిగా చేరడం లేదు. యూనివర్సిటీలో ఇంకా కొన్ని కొత్త కోర్సులను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది.



పాలమూరు యూనివర్సిటీ ప్రధాన ద్వారం

దృష్టి పెట్టాల్సిన మరికొన్ని అంశాలు..

- రాష్ట్ర ప్రభుత్వం పీయూకి అను బంధగా క్యాంపస్‌లో ఇంజనీరింగ్, లా కాలేజీ ప్రారంభించాలని ప్రభుత్వం ఓకే చెప్పింది. కానీ వసతులు లేకపోవడంతో ప్రారంభించడం లేదు.
- ఎగ్జామినేషన్ బ్రాంచ్, హెల్త్ సెంటర్లలో నాన్ టీచింగ్ సిబ్బంది ప్రక్షాళన అత్యంత అవసరం.. చిన్నచిన్న అవకతవ కలు జరిగినట్లు తేలడంతో కొంతమందిని తొలగించారు. హెల్త్ సెంటర్ ఉంది కానీ మందులు ఉండటం లేదు.
- యూనివర్సిటీలో సెక్యూరిటీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. క్యాంపస్‌లో సీసీ కెమెరాలు ఉన్నా.. దొంగతనాలు జరుగుతున్నాయి. ఈవ్‌టీజింగ్ వంటి ఘటనలు జరుగుతాయి. ఈ వ్యవస్థను సరిదిద్దాల్సిన అవసరం ఉంది.
- వర్సిటీలో 20 కోర్సులు ఉండగా.. క్యాంపస్ ప్రారంభించినప్పటి పుస్తకాలు తప్పా.. లైబ్రరీ అధునికీకరణ జరగ లేదు. అకాడమిక్ పుస్తకాలతో పాటు జర్నల్స్, స్కాలర్స్‌కు కావాల్సిన రెఫరెన్స్ మెటీరియ లో అందుబాటులో లేవు. పరిశోధన కేంద్రం కూడా యూనివర్సిటీలో లేదు. లైబ్రరీని ప్రక్షాళన చేయాల్సి ఉంది.
- ప్రధానంగా గుర్తింపు రావాలంటే యూజీసీ నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడి టేషన్ కౌన్సిల్ ర్యాంకు అవసరం.. ప్రస్తుతం పీయూకు న్యాక్ బీగ్రేడ్ ఉంది. ఈ ర్యాంకు మెరుగు పడితే నిధులు, గుర్తింపు వస్తోందని అభిప్రాయం ఉంది.
- హాస్టళ్లలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటోంది. తాగునీటి కోసం ఏ ర్పాటు చేసిన ఫిల్టర్లు సరిగా పనిచేయ డం లేదు. బాత్‌రూంలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

క్వింటా చెరకుకు రూ.3,500 ధర ఇవ్వాలి

కొత్తకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్వింటా చెరకుకు అన్ని పోను రూ.3 వేల 500 ధర ఇవ్వాలని చెరకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చే శారు. శనివారం కృష్ణవేణి షుగర్ కర్మాగారం సమీపంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడారు. రైతులకు చెరకు సాగులో మొదటగా వచ్చే వేరు పురుగు తెగుళ్లను నివారించి, రైతును నష్టాల బారి నుంచి కాపాడాలన్నారు.

అలాగే రికవరీ, చెరకు కటింగ్, ఎద్దుల బండి రవాణా ఖర్చులు కర్మాగారం భరించాలన్నారు. కోతకు వచ్చిన చెరకును వరుస క్రమంలో కోయించాలన్నారు. పెండింగ్‌లోని విత్తన బిల్లులు 45 రోజుల్లో ఇవ్వాలని, ఆలస్యం చేస్తే 16 శాతం వడ్డీతో చెల్లించాలన్నారు. విత్తన, డ్రిప్ సబ్సిడీ రుణాలు వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. చెరకు పంట సాగు చేస్తున్న రైతులకు షుగర్ కర్మాగారం, ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. అనంతరం కర్మాగారం డీజీఎం మురళి, ఏజీఎం పాండురంగరావులకు డిమాండ్లతో కూడిన వినతి అందజేశారు. సమావేశంలో కృష్ణవేణి చెరకు అభివృద్ధి మండలి చైర్మన్ చంద్రశేఖర్ (గొల్లబాబు) చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్ల ప్రధాన కార్యదర్శి శివుడు సహాయ కార్యదర్శులు నారాయణ, కమిటీ సభ్యులు నాగేంద్రం, షాలిమియా, రంగారెడ్డి సంజీవరెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, చంద్రసేనారెడ్డి, ధనుంజయ, భగవంత్‌రెడ్డి, రాజు, మహేంద్రచారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెరకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులతో ఉద్యోగావకాశాలు

» రాష్ట్ర ఐటీఐ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు

మన్ననూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలలో ప్రవేశ పెట్టిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులతో నిరుద్యోగ యువతకు స్వల్ప కాలంలో ఉద్యోగావకాశాలు దొరుకుతాయని రాష్ట్ర ఐటీఐ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు తెలిపారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఆర్‌ఐటీఐ)ని ఆయన శనివారం పరిశీలించారు. కళాశాలలో కోర్సులను మొట్టమొదటిగా ప్రవేశ పెట్టడంతో ఆరు కోర్సుల ప్రాముఖ్యత, ఉపయోగాలపై జిల్లాలోని ఆరు ఐటీఐల్లోని ప్రిన్సిపాళ్లు, స్థానిక నిరుద్యోగ యువకులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఏడాది, రెండేళ్ల కోర్సులను ప్రవేశపెడుతున్నామని, కోర్సు పూర్తయిన వెంటనే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఒక్కో కోర్సుకు 40 మందికి ప్రవేశాలు కల్పిస్తామని, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏటీసీ కోర్సుల్లో ప్రవేశాలు చేయించే విషయమై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. ఆర్‌ఐటీఐ జిల్లా కన్వీనర్ జయమ్మ, ఆర్‌ఐటీఐ మన్ననూరు ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామి, కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తుల్యా నాయక్, సంభు వెంకటరమణ, జూలూరి సత్యనారాయణ, రాజారాం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఏటీసీ కోర్సులపై అవగాహన కల్పిస్తున్న సీతారాములు

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి డాక్టరేట్

మక్తల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి డాక్టరేట్ లభించింది. తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని గ్లోబల్ పీస్ యూనివర్సిటీ వారు ఎమ్మెల్యే సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పాతికేళ్ల నుంచి ప్రమాద బాధితులను తన స్వంత వాహనంలో తీసుకువెళ్లడం, క్రీడాకారులు, పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందించడం, అనేక సామాజిక కార్యక్రమాల్లో సేవలను గుర్తించి అవార్డు ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ సభ్యులు తెలిపారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజాసేవనే పరమార్థంగా భావించి పేదలకు మేలు చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి గౌరవ డాక్టరేట్ రావడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. గౌరవ డాక్టరేట్ రావడంపై పలువురు ఎమ్మెల్యేను అభినందించారు.



డాక్టరేట్ అందుకుంటున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఎక్సైజ్ దాడులు

» 23 లీటర్ల సారా, 820 లీటర్ల బెల్లం పానకం, 30కేజీల పటిక స్వాధీనం

కల్వకుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ దాడుల్లో 23లీటర్ల నాటుసారా, 820లీటర్ల బెల్లంపానకం, 30 కిలోల పటిక స్వాధీనపర్చుకుని ఐదు కేసులు నమోదు చేసినట్లు కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ జే.వెంకటరెడ్డి తెలిపారు. శనివారం కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ పరిధిలోని తర్నికల్‌తండా, జేపీనగర్‌తండా, రెడ్యాతండాలలో కల్వకుర్తి ఎక్సైజ్ టీమ్, ఎస్‌టీఎఫ్‌డీ టీమ్ హైదరాబాద్, ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్ టీమ్, డీటీఎఫ్ నాగర్‌కర్నూల్ టీమ్ సభ్యులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో 23 లీటర్ల నాటుసారా, 820 లీటర్ల బెల్లంపానకం, 30కేజీల పటికను స్వాధీనపర్చుకుని ఐదు కేసులు నమోదు చేసి, ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు. నాటుసారా కాచినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి హెచ్చరించారు. ఎక్సైజ్ దాడుల్లో సీఐ బాలకృష్ణారెడ్డి, రాజ్యలక్ష్మి, ఎస్‌ఐలు అరుణ, సతీష్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.



పట్టుబడ్డ నాటుసారాతో ఎక్సైజ్, ఎస్‌టీఎఫ్‌డీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ సభ్యులు

న్యూస్ బాక్స్

తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా పాలెం ప్రాచ్య కళాశాల పూర్వ విద్యార్థి

బిజినేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాలెంలోని శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వెల్దండ నిత్యానంద రావును తెలుగు విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీసీగా నిత్యానంద రావు నియామకం పట్ల పాలెం కళాశాల పూర్వ విద్యార్థులు, ఉపన్యాసకులు, స్వంత గ్రామం మండలంలోని మంగనూర్ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



పాలెం కళాశాలలో శతాధిక గ్రంథకర్త కపిలవాయి లింగమూర్తి, విశ్రాంత ప్రధాన అచార్యులు రంగాచార్యుల శిష్యరికంలో డిగ్రీ పట్టా పొందారు. ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసి ఉస్మానియాలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి అంచెలంచెలుగా ఎదిగి ఉస్మానియా తెలుగు శాఖ అధిపతిగా, పాఠ్య ప్రణాళికా సంఘం అధ్యక్షుడిగా కొనసాగి, సీనియర్ ప్రొఫెసర్‌గా 2022లో పదవీ విరమణ పొందారు.

నవంబరు ఒకటిన భగవద్గీత కంఠస్థ పోటీలు

మరికల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో వచ్చేనెల ఒకటో తేదీన నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని శ్రీవాణి ఉన్నత పాఠశాలలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నామని తితిదే ఉమ్మడి జిల్లా కార్యక్రమాల నిర్వాహకుడు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను పాఠశాల ఆవరణలో విడుదల చేశారు. తితిదే ధర్మచార్యులు శ్రీరాములు తదితరులున్నారు.

క్రైం కార్నర్

పొలం విషయంలో కుటుంబంపై దాడి

కేటీదొడ్డి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పొలం విషయంలో ఒక కుటుంబంపై నలుగురు వ్యక్తులు దాడి చేసిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం చింతలకుంట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కురువ నాగేంద్రకు రెండు ఎకరాల భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన కురువ విజయ్, కురువ మౌలన్న, శారదమ్మ, వీరన్న శనివారం ఉదయం నాగేంద్ర పొలానికి వెళ్లి పొలం దున్నుతున్నారు. ఈ క్రమంలో నాగేంద్ర కుటుంబ సభ్యులు ఆ పొలం తమదని ఎందుకు దున్నుతున్నారని అడిగినందుకు నాగేంద్ర, అతడి భార్య మహేశ్వరి, అన్న ఆంజనేయులును కట్టెలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారన్నారు. వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించడం జరిగిందన్నారు. ఈ విషయంపై నాగేంద్ర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ల చోరీ.. కేసు నమోదు

గద్వాల క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రెండవ రైల్వేగేట్ కాలనీ, నల్లకుంటలో శుక్రవారం రాత్రి మూడు మోటర్ సైకిల్స్ చోరీకి గురైనట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్ కుమార్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి

కొత్తపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామంలో ఏడు నెలల గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఎస్సై రామ్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోనపాటి స్వాతి(23), భర్త కాశప్ప దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం స్వాతి ఏడునెలల గర్భిణీ. స్వాతి మృతికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉందని, తండ్రి కావలి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి మృతిపై విచారణ

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో బస్సును బైకు ఢీకొట్టిన ఘటనలో శుక్రవారం పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్ల సమీపంలో యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్ల గ్రామానికి చెందిన వడ్డె సంపంగి సైలేశ్ (18) మృతి చెందిన విషయంపై శనివారం నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్, హైదరాబాద్ జోనల్ ఆర్టీసీ డీఎస్పీ మహంకాళి రామ్మూర్తి, నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ.యాదయ్య, పెద్దకొత్తపల్లి ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గోకారిలు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన సంఘటనపై విచారణ చేశారు. సంఘటన జరిగిన తీరు గురించి గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా పోలీసులు శనివారం పట్టుకున్నారు. వివరాలు.. పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన జనుంపల్లి భద్రయ్యశెట్టి తన ఆటోలో దాదాపు 10 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా సాతాపూర్ సమీపంలో పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. టోను స్టేషన్‌కు తరలించారు. సోమవారం సివిల్ సప్లయ్ అధికారుల సమక్షంలో పంచనామా చేసి, కేసు నమోదు చేస్తామని ఏఎస్‌ఐ బాలనారాయణ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

చోరీలు అరికడతాం

• ఎస్‌ఐ హరి ప్రసాద్ రెడ్డి



పెబ్బేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరులో చోటుచేసుకుంటున్న చోరీలపై నివారణ చర్యలు చేపడుతున్నామని ఎస్ హరిప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. శనివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలియజేశారు.

చోరీలు నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

పెబ్బేరులో జరిగిన దొంగతనాల్లో 90 శాతం రికవరీ చేశాం. దొంగతనాలు మళ్లీ జరగకుండా నిఘా పెంచాం. త్వరలోనే ఏటీఎం దొంగలను పట్టుకుంటాం.

మండలంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి?

మండలంలో ప్రస్తుతం శాంతిభద్రతలు బాగానే ఉన్నాయి. ఎలాంటి సం ఘటన జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

గంజాయి, డ్రగ్స్ నివారణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు.?

గంజాయి, డ్రగ్స్ నివారణకు విద్యార్థులకు, యువకులకు అవగాహన కల్పిస్తున్నాం. త్వరలోనే డ్రగ్స్ గంజాయి పరీక్షలు నిర్వహిస్తాం.

పెబ్బేరులో ఎన్ని సీసీ కెమెరాలు ఉన్నాయి. ఎన్ని పని చేస్తున్నాయి?

పెబ్బేరులో 18 సీసీ కెమెరాలకు గాను 12 కెమెరాలు పని చేస్తున్నాయి. మరికొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

పేకాటపై ఎలాంటివ నిఘా ఉందా?

ఇటీవల రంగాపురం శివారులో పేకాట రాయుళ్లను పట్టుకొని రూ.ఆరు లక్షలకు పైగా నగదును పట్టుకొని కేసులు చేశాం.

ఇసుక రవాణా, రేషన్ బియ్యం తరలింపు నివారణపై చర్యలు ఏమి?

ఎవరైనా ఇసుక తరలించినా.. కేసులు నమోదు చేస్తున్నాం. రేషన్ బియ్యం తరలించినా కేసులు నమోదు చేస్తాం.

బీజేపీ బలోపేతానికి కృషి

పెబ్బేరు రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నరేంద్రమోదీ నాయకత్వం ఏర్పాటు కోసం బీజేపీ కార్యకర్తలు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని పాతపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. రాఘవేంద్ర గౌడ్, దేవేందర్ నాయుడు, నాగరాజు యాదవ్, కుబేర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా సభ్యత్వం

వనపర్తి అర్బన్ అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వానికి ప్రజల్లో విశేషమైన స్పందన వస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ అన్నా రు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా పార్కు దగ్గర ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణతో పాటు సభ్యత్వ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేముల నరేంద్రరావు హాజరై మాట్లాడారు. బీజేపీ సభ్యత్వానికి ప్రజలు నీరాజనం పలుకుతున్నారని తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడ్, ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, పెద్దిరాజు, రాజశేఖర్ గౌడ్, రామకృష్ణ, లాల్‌సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను అప్‌డేట్ చేయండి

వనపర్తి రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామ పంచాయతీలో రికార్డులను అప్‌డేట్ చేయాలని ఎంపీడీవో రాఘవ సూచించారు. శనివారం వనపర్తి మండల పరిధిలోని మెంటపల్లిలో ఆయన పర్యటించారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నర్సరీలో మొక్కల పెంపుదలకు సంబంధించి సూచనలు చేశారు. నర్సరీలో ప్రతీమొక్క బతికేలా చూడాలని అన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలకు సందర్శించి విద్యార్థులు సక్రమంగా స్కూలుకు హాజరయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి శంకర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాలల చైతన్య సభను విజయవంతం చేయండి

వనపర్తి టౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్‌లో ఈ నెల 21న నిర్వహించే మాలల చైతన్య సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మొలకలపల్లి మద్దిలేటి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాల మహానాడు జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో అక్టోబరు 14న ప్రారంభమైన మాలల చైతన్య బస్సు యాత్ర.. హైదరాబాద్ నుంచి నల్గొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజాంబాద్, సంగారెడ్డి మీదుగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సోమవారం ఉదయం 10 గంటలకు చేరుకుంటుందని తెలియజేశారు. జిల్లాలోని వివిధ మాల సంఘాల నాయకులు, మాలలు పెద్ద ఎత్తున హాజరై మాలల చైతన్య బస్సు యాత్ర విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాల మహా నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బిజ్జ సహ దేవ్, బూర్గుల నాగరాజు, కర్నె త్యాగయ్య పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అమరచింత వాసి మృతి

అమరచింత, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : అమరచింతకు చెందిన యువకుడు శనివారం హైదరాబాద్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అమరచింతకు చెందిన చింటూ కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. రూమ్‌లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. యువకుడి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

పనులు చేపట్టేదెప్పుడో?

- ప్రమాదకరంగా మారిన రామసముద్రం చెరువు కట్ట
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



ప్రమాదంగా మారిన వెంకటాపురం, జానంపేట చెరువు

శ్రీరంగాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెంకటాపురం, జానం పేట, రామసముద్రం చెరువు ప్రమాదకరంగా మారింది. పూర్వకాలంలో నిర్మించిన చెరువుకు ఎన్ని ప్రభుత్వాలు పాలకులు మారినా.. చెరువు కట్టపై పిడికెడు మట్టి వేయలేదు. కట్టపై ప్రతీ రోజు వాహనాల రాకపోకలు కనసాగుతున్నాయి. ఆటోలతో పాటు ప్రైవేటు పాఠశాలల బస్సులు కూడా ప్రయాణాలు కొనసాగిస్తాయి. చెరువు కట్ట వెనుక భాగంలో 100 ఫీట్ల లోతుగా భూమి ఉంది. అవతలి భాగంలో 12 అడుగుల చెరువులో నీరు ఉంది. వాహనాలు అటు పడ్డా, ఇటు పడ్డా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. రెండు వైపులా రక్షణ గోడ లేకపోవడంతో వాహనదారులు ప్రాణాలను అరచేతులో పెట్టుకొని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. కట్టపై వెళ్తున్న వాహనాలు ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడి అదుపు తప్పితే పెద్ద ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. కట్టపై వేసిన బీటీ రోడ్డుకు ఇరువైపులా మట్టి రోడ్డు లేకపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఆరేళ్ల కిందట మిషన్ కాకతీయ పథకం కింద రూ.1.50 కోట్ల నిధులు మంజూరైనా.. పనులు చేపట్టలేదు. ప్రతి ఏటా చెరువులో నీరు ఖాళీ కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. చెరువులో ఒండ్రు మట్టి దాదాపుగా 10 నుంచి 15 అడుగుల లోతుగా నిల్వ ఉంది. ఈ ఒండ్రు మట్టి సారవంతమైన మట్టి కావడంతో రైతులు ఆ మట్టిని పొలాలకు తరలించడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే ఆరేళ్ల కిందట మంజూరైన నిధుల నుంచి ఇటీవల కాంట్రాక్టర్ రెండు తూములకు గేట్లు ఏర్పాటు చేసినట్లు రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు కాంట్రాక్టర్ స్పందించి వెంటనే చెరువు కట్ట పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులపై ఒత్తిడి చేయించి వచ్చే వేసవిలో చెరువు నీటిని ఖాళీ చేయించి పనులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

రక్షణ గోడ నిర్మించాలి



రామసముద్రం చెరువుకు ఆరేళ్ల కిందట నిధు లు మంజూరైనా.. నేటికీ పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా కట్టని వెడల్పు చేసి రక్షణ గోడ నిర్మా ణం చేపట్టాలి. చెరువులోని ఒండ్రు మట్టిని పంట పొలాలకు తరలిస్తే భూములు సారవంతమై, రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

- వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్, జానంపేట

బాలల సంరక్షణలో కమిటీలదే కీలకపాత్ర

• అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టడంలో గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీ, మండల స్థాయి బాలల సంరక్షణ కమిటీల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బాల్య వివాహాలను అరికట్టే అంశంపై జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా గ్రామస్థాయి నుంచి అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామస్థాయి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను, మండల స్థాయిలో మండల చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను యాక్టివేట్ చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్ బాల్య వివాహాలు అరికట్టే అధికారులుగా క్రియాశీలకంగా పని చేయాలన్నారు. బాలల సంరక్షణకు సంబంధించిన హెల్ప్ లైన్ నంబర్ 1098 పైన పెండింగ్ దరఖాస్తుల విషయానికి సంబంధించి ఆర్ఐ స్థాయిలో పెండింగ్‌లోని వాటిని వేగంగా పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు. జడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్, డీవైఎస్‌వో సుధీర్ రెడ్డి, బీసీ శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సునిత, డీపీవో సురేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున, డీసీపీవో రాంబాబు, ఫిషరీస్ అధికారి లక్ష్మప్ప, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న చిన్నమ్మ థామస్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని రూరల్ డెవలప్‌మెంట్ జిల్లా అధ్యక్షురాలు చిన్నమ్మథామస్ అన్నారు. బాల్య వివాహాలపై అక్టోబరు 18న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో యాక్సిస్ టు జస్టిస్, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ గద్వాల, వనపర్తి కోఆర్డినేటర్లు అడ్విన్, కొమ్ము చంద్రశేఖర్‌తో కలిసి ఆమె శనివారం జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బాల్య వివాహం జరగక ముందే దానిని అడ్డుకోవాలని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. బాల్య వివాహం చిన్నారుల విద్య, ఆరోగ్యం హక్కులను హరిస్తాయని ధర్మాసనం తెలిపిందన్నారు. సుప్రీంకోర్టు చెప్పినట్లు బాల్య వివాహం ఒక సామాజిక రుగ్మత అని అన్నారు. దేశవ్యాప్తంగా 400 కంటే ఎక్కువ జిల్లాలో 200 పైగా ఎన్జీవో సంస్థలు బాల్య వివాహ నిర్మూలనకు కృషి చేస్తున్నాయన్నారు. సుప్రీం కోర్టు సూచించినట్లు ప్రతీ జిల్లాలో బాల్య వివాహ నిషేధికారిని ప్రభుత్వాలు వెంటనే నియమించాలన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ రోజు ప్రతి గ్రామంలో ప్రజలకు, విద్యార్థులకు బాల్య వివాహాలపై, చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్నన్ కుమార్, రాజశేఖర్, రజినీకాంత్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది ఆంజనేయులు

పాన్‌గల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది ఎం.ఆంజనేయులు అన్నారు. శనివారం మండల పరిధిలోని బుసిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు తమ చదువులతో పాటు చట్టాలపై న్యాయ అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్ర చదవాలని, వారు పట్టుదల, క్రమశిక్షణతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. న్యాయవాది ఉత్తరయ్య మాట్లాడుతూ.. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున ఫోన్లలో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దని, చట్టాలను తెలుసుకొని ఏవైనా సమస్యలు తలెత్తితే పరిష్కరించుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు తదితర అంశాలను వివరించి అవగాహన కల్పిం చారు. న్యాయవాదులు కె.యాదగిరి, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, అమ్మ ఆదర్శ విద్యా కమిటీ చైర్మన్ విజయమ్మ, పీఎస్ హెచ్‌ఎం చెనప్ప, అధ్యాపక బృందం, సీఐటీయూ నాయకులు రాము, విద్యా ర్థులు, లోక్ అదాలత్ సంస్థ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతులను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం



వనపర్తిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వనపర్తి అర్బన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా ఎగ్గొట్టిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. నందిమల్ల అశోక్, నాగన్న యాదవ్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలలకే రైతుబంధు వేయకుండా రైతులను మోసం చేసిందని జడ్పీటీసీ మాజీ సభ్యులు కృష్ణయ్యయాదవ్ ఆరోపించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు.

కొత్తకోట : పట్టణ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. విశ్వేశ్వర్, చెన్నకేశవరెడ్డి, బాబురెడ్డి, శ్రీనివాస్‌జి, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో రాష్ట్రస్థాయికి ఆత్మకూరు విద్యార్థి

ఆత్మకూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే పోటీల్లో ఆత్మకూరు విద్యార్థి అరవింద్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ నరేందర్ తెలిపారు. శనివారం ఉమ్మడి జిల్లాస్థాయిలో మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట జిల్లాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొనగా అండర్ 14, 72 కేజీల విభాగంలో అరవింద్ మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎపింకైనట్లు వివరించారు. అరవింద్‌ను విజయ్, అబ్దుల్ అభినందించారు.

టీడీపీ బలోపేతానికి కృషి

పెబ్బేరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో టీడీపీ బలోపేతం చేయడానికి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని టీ టీడీపీ కార్యదర్శి రామన్ గౌడ్ అన్నారు. శనివారం పెబ్బేరులో విలేకరులతో మాట్లాడుతూ... ఈనెల 26 నుంచి టీడీపీ తెలంగాణ వ్యాప్తంగా సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపడుతున్నారు. టీడీపీ సభ్యత్వం రూ.100 తీసుకుంటే ఆ వ్యక్తికి రూ.ఐదు లక్షల ప్రమాద బీమా కల్పిస్తుందన్నారు. శ్రీహరి, తిరుమలేష్, తిరుపతయ్య గౌడ్, బాలరాజు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం

అమరచింత, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు పేర్కొన్నారు. శనివారం అమరచింత మండల కేంద్రంలో జరిగిన సీపీఐ మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు దాటిపోయినా.. ఇప్పటికీ హామీల అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి భాస్కర్, నాయకులు రవీందర్, మల్లేష్, గీతమ్మ, శ్యాంసుందర్, లక్ష్మి నారాయణ, కుతుబ్, నిసార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దోమల అంతమే పంతం కావాలి

వనపర్తి టౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : దోమల అంతమే అందరి పంతం కావాలని ప్రముఖ కవి జనజ్వాల అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా కాలనీలో ప్రభుత్వం తరఫున రాష్ట్ర కళాకారుల బృందం ఆరోగ్య అంశాల మీద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కవి జనజ్వాల మాట్లాడారు. ఈగలు, దోమల వ్యాప్తిని అరికట్టడంలో ప్రజలందరూ ప్రభుత్వానికి, అధికారులకు సహకరించాలన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

అన్నదాత అయోమయం



చిమనగుంటపల్లిలో నేలకొరిగిన వరి చేను

వనపర్తి అర్బన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వర్షాకాలంలో సాగు చేసిన వరి జిల్లా వ్యాప్తంగా కోత దశకు వచ్చింది. మరో 10 రోజు ల్లో జిల్లా వ్యాప్తంగా వరి కోతలు కూడా ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల కురు స్తున్న వర్షాలతో అన్నదాతల్లో గుబులు రేపుతోంది. నోటికాడికి వచ్చిన పంటలు రోజూ కురుస్తున్న వ ర్షాలతో నాశనం అయ్యేలా ఉన్నాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురవడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి చేను నేలకొరిగాయి.

మహాసభను జయప్రదం చేయాలి

వీపనగండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోపాల్‌దిన్నెలో ఆదివారం నిర్వహించనున్న సీపీఎం మండల మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మహాసభలకు అన్ని గ్రామాల కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు. సభలో మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. మహాసభలకు ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ హాజరవుతారన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

• నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రావుల గిరిధర్



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైమ్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లోని కేసులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ... నేరం చేసిన ప్రతి నిందితుడికి కేసులో శిక్ష పడేలా న్యాయాధికారులతో కలిసి కృషి చేయాలని సూచించారు. ప్రతి కేసును సాంకేతిక పరిజ్ఞానంతో ఆధారాలతో సహ పకడ్బందీగా దర్యాప్తు చేసినప్పుడే న్యాయస్థానాలు నమ్ముతాయని, నిందితులు కూడా చట్టం నుంచి తప్పించుకోకుండా శిక్షకు అరులవుతారని తెలిపారు. అదే విధంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దొంగతనాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాలు ఏర్పాటుపై కూడా విస్తృతంగా ప్రతి గ్రామంలో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం వివిధ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీసీఎస్ సీఐ రవిపాల్, కొత్తకోట ఎస్ఐ మంజునాథ్ రెడ్డి, పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి, డీసీఆర్‌బి ఎస్ఐ రవి ప్రకాష్, శ్రీరంగాపూర్ ఎస్ఐ రామకృష్ణ, వనపర్తి టౌన్ హెడ్ కానిస్టేబుల్ సంజీవయ్య, ఐటి కోర్ కానిస్టేబుల్ మురళీకృష్ణ, పానుగల్ కానిస్టేబుల్ రాంగోపాల్ వర్మ, సీసీఎస్ కానిస్టేబుల్ స్వామిలకు ఎస్పీ ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజావత్, డీసీఆర్‌బి డీఎస్పీ కృష్ణ కిషోర్, సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం, వనపర్తి సీఐ నాగభూషనంరావు, ఆత్మకూరు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి



సరస్వతీ మాత విగ్రహానికి భూమి పూజ చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు

• జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

పెబ్బేరు రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు వారి తల్లిదండ్రులు సహకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు అన్నారు. శనివారం మండలంలోని యాపర్లలో జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న సరస్వతి మాత విగ్రహానికి భూమి పూజ చేశారు. కాంప్లెక్స్ పాఠశాలల హెచ్‌ఎం నరసిం హరావు, శంకర్‌గౌడ్, వెంకటేష్, మైనోద్దీన్, ఈశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కవిత, శివానీ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

వీపనగండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ కోఆర్డినేటర్ యుగేందర్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని కల్వరాల జడ్పీహెచ్‌ఎస్ సంగినేనిపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతికి సంబంధించిన పలు అంశాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులందరూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని సూచించారు. తల్లిదండ్రుల మొబైల్‌లో ఇంటింటా చదువుల పంట (సీఐపీ)యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలియజేశారు. ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ ఉన్నత పాఠశాలలో ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలో పరీక్షల ముందు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో నరసింహ, రాజ్యవర్ధనాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పాన్‌గల్ : విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీ డీవో గోవిందరావు, ఎంఈవో బి.శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల ప్రగతి, పురోభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర గురించి చర్చించారు.

సామాజిక తనిఖీకి సిద్ధంగా ఉండాలి

పాన్‌గల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీకి పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో గోవిందరావు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీ మండలానికి నవంబర్ మొదటి వారంలో వస్తారన్నారు. గ్రామ స్థాయిలో సంబంధిత రికా ర్డులు, జాబ్‌కార్డులు, ఏడు రిజిష్టర్లు అప్‌డేషన్ చేసు కోవాలని సూచించారు. హరితహారానికి సంబం ధించిన మొక్కలు 100 శాతం ఉండేలా చూడా లని తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం మండ లంలో పనులు గుర్తింపునకు సంబంధించిన గ్రామ సభలు జరుగుతున్నందున అన్ని గ్రామా ల్లో పూర్తిస్థాయిలో పనులు గుర్తించాలని తెలియజేశారు. రఘురాం, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై బురద చల్లేందుకు టీఆర్‌ఎస్ కుట్రలు



పెబ్బేరు ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంత స్థలం విషయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని బదలం చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం పెబ్బేరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సంత స్థలం విషయంలో హైకోర్టు తీర్పు ఇచ్చిందని, పూజారులతో పాటు రియల్టర్ నీలం గౌడ్ కరపత్రాలు పంపిణీ చేయించారని తెలియజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న పెద్దలు సంత స్థలాన్ని, అక్రమంగా ఆలయ భూమిని కాజేయాలనే ఉద్దేశంతో చేసిన ప్రయత్నాలే నేడు ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా సంత స్థలాన్ని వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు దయాకర్ రెడ్డి , నాయకులు సురేందర్ గౌడ్, మహమ్మద్ షకీల్, రాములు, సునీల్ పాల్గొన్నారు.

వేరుశనగ సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వీపనగండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి డా.కేశ్వర్ గౌడ్ రైతులకు తెలిపారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో వేరుశనగ పంటలను పరిశీలించారు. వేరుశనగలో మొలక కుళ్లు తెగులు, పొగాకు, లద్దె పురుగు, ఆకుపచ్చ తెగులు ఆశిం చిందన్నారు. మొలక కుళ్లు తెగులు నివారణ కోసం కార్బండిజమ్, మ్యాంకోజోబ్ మందులను లీటర్‌కు 2.5 గ్రాములు కలిపి మొదలు తడి సేలా పిచికారి చేయాలని తెలిపారు. తెగులు ని వారణకు క్లోరదలినిల్ 400 గ్రాములు లేదా టై బుకొన్నజోల్ 200 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేయా లని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్‌కుమార్ పాల్గొన్నారు.